క్లుప్తంగా

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బోసుబాబు, ఏఆర్ మూర్తిలు కోరారు. శుక్రవారం సాయంత్రం వారు ఆర్టీసీ డీపీటీఓ గోపాల్‌రెడ్డిని కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ మధ్యకాలంలో జిల్లాలో రద్దు చేసిన సర్వీసులను పునరుద్ధరించాలని కోరారు. కొంతమంది ఉద్యోగులను పనిష్మెంట్ పేరుతో సొంత డిపోల నుంచి ఇతర డిపోలకు పంపించిన ఉద్యోగులను తిరిగి ఇక్కడే విధులు నిర్వర్తించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కడప డిపో అధ్యక్షులు రాము, ప్రొద్దుటూరు డిపో కార్యదర్శి బీసీ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్ క్యాంపులో గ్రామసర్వే

వైవీయూ : కడప ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో చెన్నూరు మండల పరిధిలోని రామనపల్లెలో నిర్వహిస్తున్న ఎన్‌ఎస్‌ఎస్ స్పెషల్ క్యాంపు రెండోరోజు కొనసాగింది. క్యాంపులో భాగంగా శుక్రవారం ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డా. విజయలక్ష్మి ఆధ్వర్యంలో వలంటీర్లు గ్రామంలోని పలు ఇళ్లను సందర్శించి గ్రామస్థులతో ముఖాముఖి సంభాషించి 32 ప్రశ్నలతో కూడిన గ్రామ సర్వేను నిర్వహించారు. ప్రజల కుటుంబసభ్యుల వివరాలు, అధికార విద్య, సాధారణ ఉద్యోగం తదితర అంశాలపై సర్వే నిర్వహించారు.

బీజేపీ బడ్జెట్ కార్పొరేట్ కంపెనీలకు ఆదాయం

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ కార్పొరేట్ కంపెనీలకు ఆదాయం పెంచే బడ్జెట్‌గా ఉందని సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ కేవలం కార్పొరేట్ కంపెనీల ఆదాయం రెట్టింపు చేసే విధంగా ఉందన్నారు. విభజన హామీలు, కడప ఉక్కు, కడప బెంగుళూరు రైల్వేలకు బడ్జెట్ కేటాయింపుల్లో మరో మారు మొండి చేయి చూపించారన్నారు.


బడ్జెట్ ప్రతుల దహనం

కేంద్రంలో మోడీ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ ప్రజా వ్యతిరేక బడ్జెట్‌గా ఉందని సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని జ్యోతిరావు పూలే సర్కిల్ వద్ద కేంద్ర బడ్జెట్‌ను నిరసిస్తూ బడ్జెట్ కాపీలను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు రామ్మోహన్, మనోహర్, దస్తగిరి రెడ్డి, అన్వేష్ తదితరులు పాల్గొన్నారు.

'సీమ' రైతుకు 'బైరపురెడ్డి' కావ్య గౌరవం

కడప కల్చరల్ : కవి బైరపురెడ్డి రెడ్డి నారాయణ రెడ్డి రాయలసీమ రైతు పేరిట కావ్యం రాసి రైతుకు గౌరవం కల్పించారని వక్తలు కొనియాడారు. బైర్రపురెడ్డి రెడ్డినారాయణ రెడ్డి 102వ జయంతిని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో శుక్రవారం నిర్వహించారు. తొలుత బ్రౌన్ కేంద్రం సిబ్బంది పాఠకులతో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాల సమర్పించి నివాళులర్పించారు. బ్రౌన్ కేంద్రం సంచాలకులు ఆచార్య రామప్రసాదరెడ్డి మాట్లాడుతూ బైర్రపురెడ్డి రెడ్డినారాయణరెడ్డి జీవిత విశేషాలను వివరించారు. బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ చింతకుంట శివారెడ్డి మాట్లాడారు. బ్రౌన్ కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



నాయీ బ్రాహ్మణ సంక్షేమ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మేయర్ సురేష్ బాబు

కడప కార్పొరేషన్: ఏపీ నాయీ బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన సంక్షేమ క్యాలెండర్-2024ను ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషా, మేయర్ సురేష్ బాబు వేర్వేరుగా ఆవిష్కరించారు. స్థానిక అపూర్వ ఫంక్షన్ హాలులో నిర్వహించిన కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యులు, ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యానాదయ్య మాట్లాడుతూ నాయీ బ్రాహ్మణుల సంక్షేమానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆరు ప్రత్యేక జీవోలను తీసుకొచ్చిందన్నారు. ఆ జీవోలన్నీ ఈ క్యాలెండర్‌లో పొందుపరిచి ఈ ప్రభుత్వం నాయీ బ్రాహ్మణులకు చేసిన మేలును ప్రతి ఒక్కరికీ తెలిసేలా, ప్రతి షాపులో క్యాలెండర్ ఉండేలా 50వేల క్యాలెండర్లను ముద్రించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏపీ సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ పులి సునీల్, ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ వినోద్, తోటక్రిష్ణ, రఘునాథరెడ్డి పాల్గొన్నారు.

ఇంటింటి ప్రచారం

పెండ్లిమర్రి : రాష్ట్రాభివృద్ధి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమవుతుందని జెడ్పీ వైస్ చైర్మన్ బాలయ్య, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చంద్రారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి శివశంకర్‌రెడ్డిలు తెలిపారు. మండలంలోని కొత్తగిరియంపల్లె, తిప్పిరెడ్డిపల్లె, చీమలపెంట గ్రామ పంచాయతీల్లో రెండు టీమ్‌లుగా ఏర్పడి శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు

– ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషా

కడప కార్పొరేషన్: కడప నగరంలోని 14వ డివిజన్ ప్రకాష్‌నగర్‌లో నిర్వహించిన ×గడప గడపకు మన ప్రభుత్వం॰ కార్యక్రమానికి అపూర్వ స్పందన లభించింది. కార్పొరేటర్ కె. బాబు ఆధ్వర్యంలో ప్రజలు పెద్ద ఎత్తున హాజరై బాణసంచా పేల్చుతూ, గజమాల వేసి డిప్యూటీ సీఎంకు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం ప్రకాష్‌నగర్ ప్రధాన వీధిలో ర్యాలీ నిర్వహించి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు కలిగిన లబ్ధిని తెలుసుకున్నారు. అర్హులందరికీ పథకాలు అందజేస్తున్నామని.. ఇంకా అర్హులెవరికైనా పథకాలు అందలేదా అని ఆరా తీశారు. అనంతరం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సంతకంతో కూడిన బుక్‌లెట్‌ను వారికి అందజేసి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. మన రాష్ట్రంలో అమలవుతున్న నవరత్నాల పథకాలు దేశంలోనే ఆదర్శంగా నిలిచామన్నారు. సంవత్సరంలో ప్రతినెలా క్యాలెండర్ పద్ధతిలో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అని తెలిపారు. ప్రతినెలా ఒకటో తేదీ ఉదయాన్నే తెల్లవారుజామునే ఇంటి తలుపుతట్టి వలంటీర్ల ద్వారా పింఛన్లు అందజేసేలా చర్యలు చేపట్టారన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ వై ఓ నందన్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్, హరూన్ గ్రూప్స్ ఎండీ అహ్మద్‌బాషా, వైఎస్సార్‌సీపీ నాయకులు పి. జయచంద్రారెడ్డి, సీహెచ్ వినోద్, డా. శివానాయక్, తోటక్రిష్ణ, షఫీ, రామ్మోహన్‌రెడ్డి, ఎన్. సుబ్బారెడ్డి, లక్ష్మినారాయణ, మియ్యా, రహీం, సంపత్, రత్నకుమారి, టీపీ వెంకట సుబ్బమ్మ, చైతన్య, మల్లీశ్వరి పాల్గొన్నారు.

రూ.69 కోట్ల అభివృద్ధి పనులు ప్రారంభం

కడప నగరం 14వ డివిజన్‌లో స్టేట్ స్పెషల్ గ్రాంట్ రూ.69కోట్లతో చేపట్టి పూర్తి చేసిన ఓవర్ హెడ్ ట్యాంకు, సీసీ రోడ్లు, ప్రకాష్ నగర్ మెయిన్ రోడ్లను ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషా ప్రారంభించారు. అనంతరం కేక్ కట్ చేసి, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకప్పుడు అభివృద్ధికి దూరంగా ఉన్న ప్రకాష్‌నగర్ నేడు విశాలమైన రోడ్లు, మౌళిక సదుపాయాలతో ఆదర్శంగా తయారైందన్నారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చొరవ వల్లే ఇది సాధ్యమైందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు షఫీవుల్లా, పత్తిరాజేశ్వరి, బండి మరియలు పాల్గొన్నారు.



ప్రకాష్ నగర్‌లో ఓవర్‌హెడ్ ట్యాంక్‌ను ప్రారంభించిన అనంతరం స్థానిక నాయకులు, కార్యకర్తలతో డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

నూతన నియామకం

కడప కార్పొరేషన్ : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శిగా అన్నమయ్య జిల్లాకు చెందిన వై.రాజేశ్వరిరెడ్డిని నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్ర ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ నియామకం చేపట్టామని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఘన సన్మానం

కడప కార్పొరేషన్: ఆంధ్రప్రదేశ్ స్టేట్ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన షేక్ జఫ్రుల్లాను ఎన్‌ఆర్‌ఐ గ్రూప్ సభ్యులు ఘనంగా సన్మానించారు. శుక్రవారం స్థానిక నూర్జహాన్ కళ్యాణ మండపంలో ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి, శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ గల్ఫ్ కన్వీనర్ బీహెచ్ ఇలియాస్ మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యున్నతి కోసం పని చేసిన వారికి ఖచ్చితంగా సముచిత స్థానం దొరుకుతుందనేందుకు జఫ్రుల్లా ఒక ఉదాహరణ అన్నారు.

ఈ కార్యక్రమంలో ఎన్‌ఆర్‌ఐ గ్రూప్ సభ్యులు షేక్ అన్సర్ బాషా, బాబు బాయ్, షేక్ గయాజ్ బాషా, 29వ డివిజన్ ఇంచార్జ్ డిష్ జిలాని, ఫారూఖ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్లు, డ్రైనేజీ పనులను సత్వరం పూర్తి చేయాలి

కడప కార్పొరేషన్: కడప నగరంలో చేపట్టిన రోడ్లు, డ్రైనేజీ కాలువ పనులను సత్వరం పూర్తి చేయాలని నగరపాలక కమిషనర్ జీఎస్‌ఎస్ ప్రవీణ్‌చంద్ అన్నారు. శుక్రవారం మార్నింగ్ విజిట్‌లో భాగంగా ఆయన బుగ్గవంక, సెంట్రల్ జైలు శ్మశాన వాటిక, జర్నలిస్ట్ పార్కు, ఇందిరానగర్ పార్కు, గాంధీ ప్లాజా, టీఎల్‌ఎఫ్ బిల్డింగ్‌లో జరుగుతున్న పనులను పరిశీలించారు. బుగ్గ వంక ప్రహరీ పక్కన నిర్మిస్తున్న 40 అడుగుల రోడ్డు, పాత బస్టాండు నుంచి భవానీ నగర్ బ్రిడ్జి వరకూ నిర్మించిన రోడ్డు నాణ్యతను పరిశీలించారు. వీధుల నుండి బుగ్గవంకకు కలిసే డ్రైనేజ్ ఔట్‌లెట్లను పరిశీలించి, లెవెల్స్ ఆధారంగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. సెంట్రల్ జైలు శ్మశానానికి గ్రావెల్ రోడ్డు, గోడలకు పెయింటింగ్ వేయాలన్నారు. స్మశాన వాటికలో నిర్మించిన మరుగుదొడ్లను పరిశీలించారు నగరవనంలో నిర్మించిన మరుగుదొడ్ల నాణ్యతను పరిశీలించారు. జర్నలిస్ట్ పార్కులో గ్రీనరీని మెరుగుపరచాలని, ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. మొక్కలకు నీటి సరఫరా చేయడానికి డ్రిప్ ఏర్పాటు చేయాలన్నారు. ఇందిరానగర్ పార్క్‌లో ఏర్పాటు చేసిన బ్యాడ్మింటన్, వాలీబాల్ కోర్టులను పరిశీలించారు. స్థానిక ప్రజలు విశ్రాంతి తీసుకోవడానికి బెంచీలు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఈ రత్నాల రాజు, డీఈలు రాజేష్, వేణుగోపాల్, హార్టికల్చర్ ఏడీ అనిల్ కుమార్, ఏఈ మణిగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.



మార్నింగ్ విజిట్‌లో భాగంగా అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ ప్రవీణ్‌చంద్

గాంధీనగర్ ఉన్నత పాఠశాల తనిఖీ ..

ఎర్రముక్కపల్లెలోని గాంధీ నగర్ మున్సిపల్ హై స్కూల్‌ను కమిషనర్ ప్రవీణ్‌చంద్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఉపాధ్యాయుల హాజరు పట్టికలను పరిశీలించారు అనంతరం పదవ తరగతి విద్యార్థులు పరీక్షలు సులభతరంగా రాయడానికి కొన్ని సూచనలు చేశారు. పరీక్షల్లో మంచి మార్కులు వచ్చేలా విద్యార్థులు ప్రేరణ పుస్తకాలను చదువుకోవాలని తెలిపారు. ఆ తర్వాత పాఠశాలలో శానిటేషన్ వర్కర్లకు జరుగుతున్న సఫారీ కర్మచారీ ట్రైనింగ్‌లో పాల్గొన్నారు.

జగనన్నతోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యం

వల్లూరు : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రంలో సంక్షేమంతో పాటు అభివృద్ధి సాధ్యమని వైఎస్ఆర్‌సీపీ మండల కన్వీనర్, మాజీ జడ్పీటీసీ అబ్బిరెడ్డి వీరారెడ్డి తెలిపారు. మండల పరిధిలోని బీచువారిపల్లె, బీచువారిపల్లె ఎస్సీ కాలనీలో శుక్రవారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా పార్టీ నేతలతో కలిసి ఆయన ఇంటింటికీ తిరిగి ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాల వివరాలను ఆరా తీశారు. ఒక పక్క అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను కొనసాగిస్తూ అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇస్తూ పాలన సాగిస్తున్న జగన్ తిరిగి సీఎం కావాల్సిన అవసరం వుందని వివరించారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేసి వైఎస్ఆర్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పీ రవీంద్రనాథరెడ్డి, ఎంపీ అభ్యర్థి వైఎస్ అవినాష్‌రెడ్డిలను గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ వెంకటసుబ్బయ్య, మాజీ ఎంపీటీసీ వెంకటసుబ్బారెడ్డి, పార్టీ నేతలు నాగిరెడ్డి, మస్తాన్, పుల్లయ్య, రిటైర్డ్ ఎస్‌ఐ జగన్‌మోహన్‌రెడ్డి, సుధాకర్ రెడ్డి, రఘు, బాబు, బుజ్జి, సురేష్, సుబ్బరాయుడు, ఇందిరెడ్డి శంకర్‌రెడ్డి, శివకుమార్‌రెడ్డి, నాగసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బీచువారిపల్లెలో ప్రచారం నిర్వహిస్తున్న అబ్బిరెడ్డి వీరారెడ్డి, పార్టీ నేతలు

ప్రమాద రహిత డ్రైవింగ్‌పై దృష్టి సారించాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీలో డ్రైవర్లు ప్రమాద రహిత డ్రైవింగ్ పట్ల దృష్టి సారించాలని కడప సీనియర్ మెడికల్ ఆఫీసర్ రాచవీటి శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. శుక్రవారం కడప నగరం ఆర్టీసీ ఆర్‌ఎం కార్యాలయ కాన్ఫరెన్స్ హాలులో ఇంధన పొదుపులో వెనుకబడిన, బస్సులను ప్రమాదాలకుగురి చేస్తున్న డ్రైవర్లకు రోడ్డు భద్రతా మాసోత్సవ సందర్భంగా శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైవర్లు మద్యపానానికి దూరంగా ఉండాలన్నారు. విధి నిర్వహణలో పాటించే చిన్నచిన్న జాగ్రత్తలతో సంస్థకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. డ్రైవర్లు విధినిర్వహణ సమయంలో తమ కుటుంబ సభ్యులతోపాటు బస్సుల్లోని ప్రయాణీకుల భద్రతను దృష్టిలో పెట్టుకోవాలని సూచించారు. అనంతరం డ్రైవర్లకు ఆరోగ్య అంశాలపై పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ చేశారు. తర్వాత ఓం శాంతి సంస్థ ప్రతినిధి ప్రదీప అక్కయ్య ఏకాగ్రత, ధ్యానంపై దిశా నిర్దేశం చేశారు. చివరగా డీపీటీఓ బస్సు ప్రమాదాలకు కారణమైన, డ్రంక్అండ్‌డ్రైవ్ క్లయింట్ డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. రీజినల్ సేఫ్టీ డ్రైవింగ్ ఇన్‌స్ట్రక్టర్ కృష్ణారెడ్డి, ప్రొద్దుటూరు డ్రైవింగ్ ఇన్‌స్ట్రక్టర్ ఎంజీ రెడ్డి ప్రాక్టికల్ ట్రైనింగ్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రజా రవాణాధికారి గోపాల్‌రెడ్డి, బద్వేలు డిపో మేనేజర్ శ్రీనివాసరావుతోపాటు జిల్లాలోని వివిధ డిపోలకు చెందిన డ్రైవర్లు, కండక్టర్లు పాల్గొన్నారు.



డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ రాచవీటి శ్రీకాంత్‌రెడ్డి

హామీలన్నీ నెరవేర్చిన ఘనత జగనన్నదే

కమలాపురం : ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చిన ఘనత జగనన్నదేనని వైఎస్సార్ సీపీ నాయకులు అన్నారు. మార్కెట్ యార్డు చైర్మన్ ఎస్‌సీ పుల్లారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ మారుజోళ్ల శ్రీనివాసరెడ్డి, మాజీ జడ్పీటీసీ మస్తానయ్య, మాజీ సర్పంచ్ దేవదానం ఆధ్వర్యంలో బుధవారం 8వ వార్డులో, ఆర్‌వీఎస్‌ఆర్, కౌన్సిలర్ నిఖిల్‌రెడ్డి ఆధ్వర్యంలో 4వ వార్డులో ఇంటింటికి తిరిగి జగనన్నకే ఓటు వేయాలని ప్రచారం నిర్వహించారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేనన్ని పథకాలు ఏపీలో అమలు అవుతున్నాయన్నారు. ఈ పథకాలన్నీ తిరిగి రావాలంటే తప్పనిసరిగా ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి జగనన్నను తిరిగి సీఎం చేసుకోవాల్సిన అవసరం ఉందని ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో నాగేశ్వర్‌రెడ్డి, సుధీర్, జంగంరెడ్డి, విశ్వం, బాబ్జీ, మధు, కృష్ణారెడ్డి, శంకర్‌రెడ్డి, పవన్, ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కమలాపురంలో ఇంటింటి ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఉపాధ్యాయులు శిక్షణ వినియోగించుకోవాలి

కడప ఎడ్యుకేషన్: రాష్ట్ర ప్రభుత్వం గణిత ఉపాధ్యాయుల కోసం ఇస్తున్న సిమ్యులేషన్ సాఫ్ట్‌వేర్ శిక్షణను ఉపాధ్యాయులు ఉపయోగించుకోవాలని డీఈఓ రాఘవరెడ్డి సూచించారు. శుక్రవారం కడప జయనగర్ కాలనీ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో కడప డివిజన్ పరిధిలోని గణిత ఉపాధ్యాయులకు సిమ్యులేషన్ సాఫ్ట్‌వేర్ ఉపయోగించి బోధించడంపై ఒక్క రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులకు రోబో కంపాస్, జియా జీబ్రా, టార్షియా గ్రిడ్స్, షెట్ సిమ్యులేషన్, ఓలాబ్స్ యాప్స్ వంటి టెక్నాలజీ యాప్స్, వెబ్‌సైట్ ఉపయోగించడం ద్వారా విద్యార్థులకు ఆసక్తి కలిగించేటట్లు బోధించవచ్చని తెలియచేశారు. డిప్యూటీ ఈఓ రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ ఇలాంటి శిక్షణ ఉపాధ్యాయులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో సమగ్రశిక్ష ఏఓంఓ ధనలక్ష్మి, కడప ఎంఈఓ పాలెం నారాయణ, హెచ్‌ఎం భాగ్యవతి, సిమ్యులేషన్ ట్రైనింగ్ జిల్లా నోడల్ ఆఫీసర్ కిరణ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ రాఘవరెడ్డి

నకిలీ పత్రాలు సృష్టించి స్థలం కాజేశారు

– బాధ్యులపై చర్య తీసుకోవాలని బాధితుల వేడుకోలు

కడప కోటిరెడ్డిసర్కిల్ : నకిలీ అనుబంధ పత్రంతో రిజిస్ట్రేషన్ చేయించుకున్న అన్నిక శ్రీనివాసులుపై చట్టపరమైన చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని బాధితులు రేపూరి సుబ్బరామయ్య, లక్ష్మమ్మ కోరారు. ఈ మేరకు వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కడప నగరం 2వ డివిజన్ ఉక్కాయపల్లిలో సర్వే నంబర్ 653లో తమకు మూడు సెంట్ల స్థలం ఉందన్నారు. 1976లో ప్రభుత్వం తమ పేరుతో డి-ఫారం ఇచ్చిందన్నారు. తాము ఆ స్థలంలో బోదకొట్టం వేసుకుని ఉండగా, ప్రమాదవశాత్తు కాలిపోయిందన్నారు. అప్పటి నుంచి ఆ స్థలం ఖాళీగా ఉందని తెలిపారు. అయితే తన మేనల్లుడు అన్నిక శ్రీనివాసులు అతని పేరుతో నకిలీ పత్రాలు సృష్టించి రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడని తెలిపారు. అంతేకాక పేరూరి విజయ్ కుమార్ అనే వ్యక్తి భార్య పేరుతో విక్రయించి మళ్లీ రిజిస్ట్రేషన్ చేయించాడన్నారు. ఈ విషయమై కడప మండల తహసీల్దార్‌కు ఫిర్యాదు చేయగా విచారించి 2019లో ఆ స్థలం తమదేనని ఎండార్స్‌మెంట్ ఇచ్చారని చెప్పారు. ఇటీవల అన్నిక శ్రీనివాసులు అతని బంధువైన ఓ పోలీసు మద్దతుతో నకిలీ పత్రాలు సృష్టించి ఈ భూమిని విక్రయించాడని తెలిపారు. అతనిపై వెంటనే చర్య తీసుకుని తమకు న్యాయం చేయాలని వారు కోరారు.

భక్తిశ్రద్ధలతో వ్రతం

కడప కల్చరల్ : కడప నగరం శ్రీ కన్యకా పరమేశ్వరీదేవి ఆలయంలో శుక్రవారం శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీదేవి వ్రతాన్ని వైభవోపేతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఉత్సవమూర్తిని అభిషేకించారు. వివిధ ఫల పుష్పాలతో కూడిన అభిషేకం చేశారు. తర్వాత కనుల పండువగా అలంకరించారు. ఆలయ ప్రాంగణంలో విశేషంగా వేదికను ఏర్పాటు చేశారు. చుట్టూ చెరకు గడలు ఏర్పాటు చేసి కొబ్బరి ఆకులతో అలంకరించారు. తొలుత గణపతిపూజ, నవగ్రహ పూజ, కలశ ప్రతిష్ఠ, కలశపూజ, వాసుదేవ పుణ్యాహవాచనం నిర్వహించారు. అమ్మవారిని వెండి పల్లెంలో కొలువుదీర్చి అర్చకుల వేదమంత్రోచ్చాటనల మధ్య విశేష పూజలు చేశారు. శ్రీ వాసవీ అష్టోత్తర నామావళి, పుష్పార్చన చేశారు. శ్రీ వాసవీ మాల ధరించిన భక్తులు దీక్ష పూర్తయిన సందర్భంగా అమ్మవారికి ప్రత్యేకంగా కుంకుమార్చన నిర్వహించారు.



వ్రత విధానాన్ని వివరిస్తున్న అర్చకుడు



వ్రతాన్ని ఆచరిస్తున్న భక్తులు

భద్రత కల్పించి ఆదుకోవాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: ఫ్లిప్‌కార్ట్, జొమాటో, ఓలా, ఉబర్, డన్జో, ఫ్రెష్‌ఆన్, జెప్టో తదితర వాటిలో పనిచేసే వర్కర్లకు సామాజిక భద్రత కల్పించి ఆదుకోవాలని ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రటరి కెసీ బాదుల్లా పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని హోచిమన్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ, కర్ణాటక, రాజస్థాన్ తదితర రాష్ట్రాలు తీసుకొచ్చిన విధంగా చట్టం తీసుకువచ్చి గిగ్ వర్కర్లను ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి లింగన్న, నగర అధ్యక్షులు పి. సుబ్బరాయుడు పాల్గొన్నారు.

వేతనాల పెంపుపై హర్షం

కడప ఎడ్యుకేషన్: రాష్ట్ర ప్రభుత్వం పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్లకు వేతనాలను పెంపుదల చేయడం ఆనందదాయకమని రాష్ట్ర పీటీఐ (పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్ల)ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ హాజీమలంగ్, రాష్ట్ర కార్యదర్శి పరదేశి ఓబన్న పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీటీఐల వేతనాల పెంపు కోసం ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి కృషి చేశారన్నారు. ఇందుకుగాను శుక్రవారం కడపలో ఎమ్మెల్సీని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి బద్వేల్ చిన్నవెంకటసుబ్బయ్య, కడపజిల్లా సభ్యులు గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌తో నిరాశ

కడప ఎడ్యుకేషన్: కేంద్ర బడ్జెట్ రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయులకు తీవ్ర నిరాశ కలిగించిందని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఇలియాష్‌బాష, సంగమేశ్వరరెడ్డి అన్నారు. శుక్రవారం కడప ఎస్టీయూ భవన్‌లో నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో ఇలియాష్‌బాష, సంగమేశ్వరరెడ్డి, ఎస్టీయూ సీనియర్ నాయకులు సురేష్‌బాబు మాట్లాడుతూ పెరిగిన జీవన ప్రమాణాలు, నిత్యావసర వస్తువులు ధరలను దృష్టిలో ఉంచుకుని కనీస ఆదాయపు మినహాయింపు పరిమితిని పెంచకపోవడం గర్హనీయం అన్నారు. ఆదాయపు పన్ను మినహాయింపు రూ. 5 లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు.

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

కడప కోటిరెడ్డి సర్కిల్/కార్పొరేషన్ : ప్రభుత్వ పథకాలను మహిళలు సద్వినియోగం చేసుకుని ఆర్థికశక్తిగా ఎదగాలని మెప్మా పీడీ సురేష్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం కడప నగరం 26వ డివిజన్ ఆకులవీధి, మాసాపేట, గాజుల వీధిలో ఒక్కొక్క యూనిట్ రూ. 2.60 లక్షలతో ఏర్పాటు చేసిన పేపర్ ప్లేట్ల తయారీ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పీడీ సురేష్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ సహకారంతో రేణుక, యల్లమ్మ, సులోచనమ్మలు ఏర్పాటు చేసిన పేపర్ ప్లేట్ల తయారీ కేంద్రాన్ని ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. మహిళలు వ్యాపారాలు నిర్వహిస్తూ ఆర్థికంగా పరిపుష్టి సాధించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. అర్హతగల స్వయం సహాయక సంఘాలకు రూ. 20 లక్షల వరకు ప్రభుత్వం రుణాలు ఇస్తుందని, ఆర్థిక క్రమశిక్షణతో మహిళలు తమ అభివృద్ధికి బాటలు వేసుకోవాలన్నారు. పేపర్ ప్లేట్ల తయారీ మిషనరీ కోసం ప్రభుత్వం రూ. 2.60 లక్షలు మంజూరు చేసిందని, దానికి అదనంగా రూ. 5 వేలు చొప్పున నాలుగు నెలలకు అద్దెకుగాను రూ. 20 వేలు ప్రభుత్వం ప్రకటించిందని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ షంషీర్, ఎల్‌హెచ్ నాగరాజు, ఇమ్రాన్‌ఎం, హరిప్రసాద్‌రెడ్డి, ఆర్పీలు పాల్గొన్నారు.



పేపర్ ప్లేట్ల తయారీ యూనిట్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న అధికారులు

డిప్యూటీ కమిషనర్‌కు వినతి



కార్మికశాఖ డిప్యూటీ కమిషనర్‌కు వినతిపత్రాన్ని సమర్పిస్తున్న దృశ్యం

కడప కోటిరెడ్డిసర్కిల్ : విద్యుత్ రంగంలో జరుగుతున్న పరిణామాలు విద్యుత్ ఉద్యోగుల్లో తీవ్ర ఆందోళనను, అభద్రతాభావాన్ని కలిగిస్తున్నాయని సీఐటీయూ నాయకులు, విద్యుత్ ఉద్యోగుల స్ట్రగుల్ కమిటీ ప్రతినిధులు తెలిపారు. శుక్రవారం కాంట్రాక్ట్ కార్మికులు, ఎనర్జీ అసిస్టెంట్లు జేఎల్‌ఎం గ్రేడ్-2లు, విద్యుత్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పైన రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు డిప్యూటీ కమిషన్ ఆఫ్ లేబర్, విద్యుత్‌శాఖ ఎస్‌ఈకి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒకే సంస్థలో రెండు రకాల సర్వీస్ రెగ్యులేషన్స్ తీసుకురావడం విద్యుత్ ఉద్యోగులకు తీవ్ర నష్టం కలిగించే అంశమన్నారు. విద్యుత్ పంపిణీ కంపెనీలలో కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ కార్మికులకు వేతనాలు తగ్గించి చెల్లిస్తున్నారని, ట్రాన్స్‌కో, జెన్కోలతో సమానంగా వేతనాలు చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులురెడ్డి, విద్యుత్ ఉద్యోగుల స్ట్రగుల్ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

నువ్వు పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

వీరపునాయునిపల్లె : రబీ సీజన్‌లో సాగులో ఉన్న నువ్వు పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని కమలాపురం సహాయ వ్యవసాయ సంచాలకులు నరసింహారెడ్డి తెలిపారు. శుక్రవారం మండల వ్యవసాయ అధికారి శ్యామ్‌బాబుతో కలసి ఎస్. పాలగిరి గ్రామంలో సాగు చేసిన నువ్వు పంటను ఆయన పరిశీలించి రైతు సోదరులకు పలు సూచనలిచ్చారు. నువ్వు పంటలో ప్రస్తుత నెలకొన్న వాతావరణం దృష్ట్యా వేరుకుళ్ల తెగులు ప్రభావంతో మొక్కలు అక్కడక్కడా చనిపోతున్నాయన్నారు. దీన్ని కట్టడి చేయడానికి కార్బెండజిమ్ మరియు మాంకోజెబ్‌ను 2.5 మిల్లీ లీటరు లేదా హెక్సకోనజోల్ 2.5 మిల్లీ నీటికి కలుపుకుని మొదళ్లు బాగా తడిచేలా పిచికారి చేసుకోవాలని సూచించారు. బూడిద తెగులు కూడా ఆశించడంతో నివారణకు మైక్లోబుటానిల్ లీటరు నీటికి 1 మిల్లీ లీటరు కలిపి పంటపై పిచికారి చేసుకోవాలన్నారు. ప్రస్తుతం సాగులో ఉన్న పంటలకు సంబంధించి నమోదు ప్రక్రియ పూర్తైందని 5325 మంది రైతులకు గాను 19021 ఎకరాల్లో పంటలు సాగు చేశారన్నారు. అందులో 4914 మంది రైతులకు ఈకేవైసీ పూర్తైందని మిగిలి ఉన్న రైతులు రైతు భరోసా కేంద్రాలకు వెళ్లి సిబ్బందిని సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు ప్రసాద్‌నాయక్, రైతులు పాల్గొన్నారు.



నువ్వు పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ సంచాలకులు నరసింహారెడ్డి